## ఫెంగ్ షుయి



# ఫ్యామిలీ ఫొటో

ఆ ఇంట్లో ఉన్నది నలుగురు సభ్యులే, భార్య, భర్త ఇద్దరు పిల్లలు. వీరు నలుగురూ నాలుగు దిక్కుల్లా ఎవరికి వారుగా ఉంటున్నారు. అందరూ కలసి కూర్చుని మాట్లాడుకునేది తక్కువ. ఒకరి గురించి మరొకరికి తెలీదు. దీని వలన సహజంగానే కుటుంబ సభ్యుల మధ్య అంతరం పెరుగుతుంది. దీన్ని అధిగమించాలంటే కుటుంబ సభ్యులు నలుగురూ కలసి ఒక ఫొటో తీయించుకోవాలి. అందులో అందరూ నవ్వుతూనే ఉండాలి. దానికి ఫ్రేమ్ కట్టించి హాలుకు నైరుతి మూలలో తగిలించాలి. ఈ ఫొటోను నిత్యం అందరూ చూస్తుండటం వలన ఒకరి పట్ల ఒకరికి అప్యాయత, అనుబంధం పెరుగుతుంది. ఒకరితో మరొకరు తమ భావాలను పంచుకుంటారు. ఆ ఇంట్లో సంతోషం మొలకెత్తుతుంది. దీంతో శాంతి సౌఖ్యాలు నెలకొంటాయి. ఇదే సూత్రం అత్తాకోడళ్లకు కూడా వర్తిస్తుంది. మనదేశంలో అత్తాకోడళ్లంటే రాయీ టెంకాయ కదా. ఒకరంటే ఒకరికి పడదు. నిజం చెప్పాలంటే చాలామంది అత్తాకోడళ్ల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఇలాంటి వారు కూడా కలసి నవ్వుతూ ఫొటో తీయించుకోవాలి. దానిని హాలులో నైరుతి దిశలో ఫ్యామిలీ ఫొటో పక్కనే తగిలించాలి. తప్పకుండా మంచి ఫలితం కనిపిస్తుంది. భార్యాభర్తలు కూడా తమ ఫొటో ఒకటి పడకగదిలో నైరుతి దిశలో ఉంచుకోవాలి. అలా చేయడం వలన వారి మధ్య ప్రేమ నిత్యనూతనంగా ఉంటుంది. కీచులాటలు దాదాపుగా ఉండవు. ఇంకేం.., వెంటనే ఫ్యామిలీ ఫొటో దిగండి. జీవితాన్ని నవ్వులతో నింపుకోండి.

*

ఇకపై వారం వారం 'ఫెంగ్ షుయి' మీకోసం!

## 'సరసి' కత

వైశంపాయనుడి స్నేహితుడు తుంబురుడు సంగీత కళాకారుడు. తిరుపతిలో ఓ పెళ్లికి అతడి గాత్రకచేరీని ఏర్పాటు చేస్తున్నారని తెలిసి వైశంపాయనుడు తను కూడా వస్తానని బ్రతిమాలేడు. హైదరాబాదు నుంచి ప్రయాణఖర్చులు పెళ్లి వాళ్లే పెట్టుకుని తీసుకెడతారని ఆతడి ఆశ. నిజానికి వైశంపాయనుడికి సంగీతంలో సాపాసాలు తెలియవు. అయినా అతడి బాధ పడలేక మృదంగిస్టు, వైలనిస్టులతో బాటు, సహకార గానంగా అతడి పేరును కూడా చేర్చి తీసుకెళ్లాడు తుంబురుడు.

స్టేజి ఎక్కేముందు పెళ్లి కూతురు మేనమామ (పెకూమేమా) వైశంపాయనుడిని చూసి "మిమ్మల్నెక్కడో కచేరీలో చూసినట్టు గుర్తు. స్వరకల్పన బాగా చేస్తారు, అవునా?" అన్నాడు. వైశంపాయనుడు జవాబుగా పిచ్చి చూపు చూసి, ఓ వెర్రినవ్వు నవ్వేడు. కచేరీ ప్రారంభమైంది. తుంబురుడికి కాస్త వెనక వైపుగా కూర్చున్న వైశంపాయనుడి వైపే తీక్షణంగా చూడసాగేడు



# సంకటం

పెకూమేమా సహకార గానం కాబట్టి తుంబురుడితో కలిసి తను పాడాలి. కాని తను నోరు తెరిస్తే ఘోరమైన అపశ్రుతులు ఖాయం! తుంబురుడు చంపేస్తాడు. పాడకపోతే పెకూమేమా ఊరుకోడు. అలాగే - పాడుతూ చేతితో తాళం కూడా వెయ్యాలి. ఇంటి తాళం తప్ప పాటకి తాళం వెయ్యడం రాదతడికి. తేడాగా వేస్తే మృదంగిస్టు తనకి మరణమృదంగం వాయించేస్తాడు. ఎలా? "వెంకట రమణా సంటక హరణా, కాపాడు తండ్రీ! ఈ సారి నా సొంత ఖర్చులతో వచ్చి నీ దర్శనం చేసుకుంటా" అని దీనంగా మొక్కుకున్నాడు వైశంపాయనుడు. ఇంతలో పెళ్లికొడుక్కి పెట్టిన మధుపర్కాలు కురచగా వున్నాయని వియ్యపురాలు పెద్ద గొంతెత్తి అవరసాగింది. పెకూమేమో మంటపం వైపు పరుగెట్టేడు. అక్కడ సర్దుబాటు చేసి, తంతు నడిపించి వచ్చేసరికి కచేరీ దాదాపు పూర్తి అయిపోయింది. "మీ గాత్రం వినలేకపోయా, మన్నించాలి, మరోసారి వింటా." అన్నాడు పెకూమేమా వైశంపాయనుడి చేతులు పట్టుకుని. "అంతా వాడి దయ" అన్నాడు వైశంపాయనుడు కొండవైపు దణ్ణం పెట్టి.

అది జరిగిన వారం రోజులకే భార్య సుబ్బాయమ్మతో కలిసి కొండకొచ్చి సంకట హరణుడి మొక్కుతీర్చుకున్నాడు వైశంపాయనుడు.

*